నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 5 నవంబర్ 2024 | HYDERABAD


### ఉచిత పార్కింగ్ కొనసాగించాలని

## మెట్రో ప్రయాణికుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న మెట్రో ప్రయాణికులు

ఉప్పల్, నవంబర్ 4 : నాగోల్‌లో మెట్రో రైల్ స్టేషన్ ఆవరణలో ఉచిత పార్కింగ్ కొనసాగించాలని కోరుతూ సోమవారం మెట్రో ప్రయాణికులు ధర్నా నిర్వహించారు. కనీస వసతులు కల్పించాలని, ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కల్పించే బాధ్యత మెట్రో సంస్థదేనని తెలిపారు. ప్రభుత్వ భూమిలో వాహనాలను నిలిపితే డబ్బులు వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. డబ్బులు చెల్లించిన వాహనాలకు రక్షణలేదని వాపోయారు. రద్దీకి తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



## కార్తీకదీపం..

సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని సుబ్రహ్మణ్య స్వామి మల్లికార్జున ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు





# పెండింగ్ బిల్లులు అడిగితే.. అరెస్టులా

పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని.. సోమవారం సర్పంచుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌కు చేరుకున్న మాజీ సర్పంచులను అడ్డుకునేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఎక్కడికక్కడ వారిని నిర్బంధించి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో గ్రామాల నుంచి నగరానికి వచ్చిన మాజీ సర్పంచులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, కౌన్సిల్ ప్రతిపక్ష నేత మధుసూదన చారితోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు వెళ్లి అండగా నిలిచారు. వారిని విడుదల చేసేంత వరకు అక్కడే బైఠాయించి మద్దతు తెలిపారు.

## బల్దియాలో డీసీల నియామకం

### మెహిదీపట్నం, మూసాపేటకు..

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో ఇద్దరు డిప్యూటీ కమిషనర్లను నియమిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బీ.సురేందర్ రెడ్డిని మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్‌గా, మూసాపేట్ డీసీగా వంశీకృష్ణను నియమించారు. ఇటీవల ఈ రెండు సర్కిళ్లలో ఉండే అధికారులు పదవీ విరమణ పొందడంతో కొత్తవారిని నియమించారు.



- అర్జీదారుల సెల్ ఫోన్, బ్యాగులు అప్పగిస్తేనే ఫిర్యాదులు స్వీకరణ
- అనుమతి లేదంటూ నిరాకరణ
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు చుక్కెదురు
- అర్జీదారుల కంటే హోంగార్డులే ఎక్కువ
- ఖైరతాబాద్ జోన్‌లో ఒక్క ఫిర్యాదు నమోదు కానీ వైనం

ప్రజావాణి... ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీలో ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమం. కానీ ఘనత వహించిన జీహెచ్ఎంసీలో ప్రజా వేదన వినేవారే కరువయ్యారు. విన్నా పరిష్కారం అవుతుందన్న గ్యారంటీ లేదు. తూతూ మంత్రంగా ప్రజావాణి నిర్వహించడం... అసలు కార్యక్రమంలో ఎన్ని ఫిర్యాదులను స్వీకరించారు? ఎన్నింటికి పరిష్కారం చూపారన్న లెక్క పత్రం లేదు. కనీసం ప్రజావాణి ఫిర్యాదులపై సమీక్షలు జరిపిన దాఖలాలు లేవు. ఇప్పటి వరకు అధికారికంగా ప్రజావాణి నివేదికను వెల్లడించకపోవడం అధికారుల పనితీరుకు, పౌరుల సమస్యలపై జీహెచ్ఎంసీ యంత్రాంగానికి ఉన్న చిత్తశుద్ధి ఏ పాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

- సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ)

# ఆంక్షల ప్రజావాణి!

ఇక గత ప్రజావాణి కంటే సోమవారం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమం ఆంక్షల నడుమ సాగింది. అపరిష్కృత సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఎంతో ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు చేదు అనుభవం ఎదురైంది. ప్రజావాణి వేదిక హాలులోకి వెళ్లాలంటే అర్జీదారుడు నిర్బంధాలను దాటి వెళ్లాలి. తన వెంట తెచ్చుకున్న సెల్‌ఫోన్, బ్యాగ్‌ను హోంగార్డు, సిబ్బందికి ఇస్తేనే వారి ఇచ్చిన టోకెన్ ద్వారా ప్రజావాణి హాలులోకి అనుమతి దక్కుతుంది. సమస్య తీవ్రత వివరించేందుకు సెల్‌ఫోన్‌ను అనుమతించాలని విజ్ఞప్తులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఆంక్షలు దాటుకుని ఒక నిమిషం ముందు ప్రజావాణి హాలులోకి వచ్చిన ఓ వృద్ధుడిని బలవంతంగా బయటకు పంపించడం శోచనీయం.

### లంచం ఇవ్వలేను..
### కాళ్ల మీద పడి వేడుకున్న శానిటేషన్ వర్కర్

విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగిపోయిందని, ట్రీట్‌మెంట్ తీసుకుని విధుల్లో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, కానీ ఏఎంవోహెచ్ రూ. 2 లక్షల లంచం అడుగుతున్నాడంటూ శానిటేషన్ వర్కర్ (శేరిలింగంపల్లి) మేయర్ కాళ్ల మీద పడి వేడుకున్నది. కుటుంబ పోషణ భారంగా మారిందని, శానిటేషన్ వర్కర్‌గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని మేయర్‌కు విన్నవించింది. కానీ మేయర్ వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేసి వెళ్లిపోవడం గమనార్హం.

### స్వీకరణ సరే.. పరిష్కారమైనవి ఎన్ని..

ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి నామమాత్రంగానే స్పందన లభించింది. ప్రధాన కార్యాలయంలో 35 ఫిర్యాదులు రాగా..అందులో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ 19, ఇతర విభాగాలకు విన్నపాలు వచ్చాయని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయని, అందులో కూకట్‌పల్లి జోన్‌లో 42, శేరిలింగంపల్లి 13, సికింద్రాబాద్ జోన్ 9, ఎల్బీనగర్‌లో 11, చార్మినార్‌లో ఐదు ఫిర్యాదులు అందగా ఖైరతాబాద్ జోన్‌లో ఎలాంటి ఫిర్యాదు రాకపోవడం గమనార్హం. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా ఐదు విన్నపాలు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు.

### ప్రజావాణికి పూర్తి సమయం కేటాయించని మేయర్

ప్రజావాణికి ఆయా విభాగాల హెచ్ఓడీలు విధిగా హాజరు కావాలని చెప్పిన మేయర్, ప్రజావాణి గడువు ముగియక (అరగంట)ముందే వెళ్లిపోయారు. అంతకు ముందు ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులను మేయర్ స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలుపాలన్నారు. పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు తెలుపుతూ లిఖితపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరి రావు, గీత రాధిక, పంకజ, సరోజ, యూబీడీ డైరెక్టర్ శ్రీనివాస్, సీసీపీ కె. శ్రీనివాస్, అదనపు సీసీపీ గంగాధర్, ఏసీపీ సుదర్శన్, సీఈ భాస్కర్ రెడ్డి, జలమండలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మెట్రో జర్నీలో అంతరాయం

## సాంకేతిక లోపంతో 15 నిమిషాలు నిలిచిన రైలు
## ఉక్కిరిబిక్కిరైన ప్రయాణికులు

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : మహానగరంలో మెట్రో రైల్ స్తంభించింది. ఉదయాన్నే ఆఫీసులకు వెళ్లే హడావిడిలో ఉండే సిటీ జనాలను.. బోగీల్లో కుక్కి ఉక్కిరిబిక్కిరి చేసింది. నిమిషమో, రెండు నిమిషాలు ఆగిపోయిందంటే పొరపాటే. ఏకంగా 15 నిమిషాలు ఎటు కదలకుండా ప్రయాణికులను ఆందోళనకు గురి చేసింది. ట్రైన్ దిగి మెట్రో స్టేషన్లకు వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురి కాగా, నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లలన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా ఉదయాన్నే ఆఫీసులు, కాలేజీలకు వెళ్లే సమయం కావడంతో నాగోల్ - రాయదుర్గం, ఎల్బీనగర్ - మియాపూర్ మార్గంలో పలు సర్వీసుల రాకపోకలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నగరంలో సోమవారం ఉదయం మెట్రో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సాంకేతిక లోపం కారణంగా రైళ్లు ఆగినట్లు మెట్రో అధికారులు తెలిపారు. మెట్రో యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్-రాయదుర్గం, ఎల్బీ నగర్- మియాపూర్ మార్గాల్లో పరుగులు తీసే మెట్రో రైళ్లకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపాన్ని సవరించడంతో అప్పటికే తీవ్ర ఆలస్యం కావడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

### మూసుకోని గేట్లు..

నాగోల్ నుంచి రాయదుర్గం వెళ్తున్న ట్రైన్... బేగంపేట్ మెట్రో స్టేషన్‌కు రాగానే నిలిచిపోయింది. ట్రైన్ డోర్లు మూసుకుపోలేదు. దీంతో ట్రైన్ ముందుకు కదలకుండా ఆగింది. ఈ కారణంగా అమీర్‌పేట్ ఇంటర్ చేంజ్‌లోతోపాటు ఎల్బీనగర్ - మియాపూర్ మార్గంలో వచ్చిపోయే సర్వీసులకు కూడా ఇబ్బంది కలిగింది. దీంతో అన్ని మెట్రో స్టేషన్ల వద్ద గంటల కొద్ది ప్రయాణికులు ఎదురు చూడాల్సి వచ్చింది. ప్రధాన ఇంటర్‌చేంజ్‌లైన ఎంజీబీఎస్, అమీర్‌పేట్ వద్ద ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఉన్నపళంగా రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.

### సాంకేతిక లోపమే కారణం : మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి

దాదాపు 15నిమిషాల పాటు మెట్రో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయని మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. రైళ్ల ఫ్రీక్వెన్సీ పునరుద్ధరించామని వివరించారు. సాంకేతిక సమస్యల కారణంగా నాగోల్-రాయదుర్గం మార్గంలో బేగంపేట్ మెట్రో స్టేషన్ సమీపంలో నిలిచిపోయిందని, దాదాపు 15 నిమిషాల పాటు మెట్రో సేవలకు అంతరాయం కలిగిందన్నారు. బేగంపేట్ వద్ద సమస్య రావడంతో అమీర్‌పేట్, మియాపూర్, నాగోల్ రూట్‌లో రైళ్లను నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. మెట్రో రైళ్లను రీస్టోర్ చేయడంతోనే సేవలు యథావిధిగా ప్రారంభమైనట్లు స్పష్టం చేశారు.



# మరికొంత సమయం కావాలి

## హద్దుల నిర్ధారణకు గడువు కోరనున్న హెచ్ఎండీఏ

### ఇప్పటివరకు 2525 చెరువులకు మాత్రమే హద్దులు..

### చెరువుల హద్దులపై నవంబర్ రెండోవారంలో హైకోర్టు విచారణ

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): చెరువుల హద్దుల నిర్ధారణకు హైకోర్టును మరికొంత సమయం కోరాలని హెచ్ఎండీఏ భావిస్తోంది. ఈ అంశం పై నవంబర్ రెండో వారంలో హైకోర్టు విచారణ చేపట్టనుండగా.. ఇప్పటికీ హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల బఫర్, ఎఫ్టీఎల్ నిర్ధారణ పూర్తి కాకపోవడంతో మరికొంత గడువు కోరేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణ సాగుతూనే ఉంది. హైకోర్టు ఆదేశించేంత వరకు చోద్యం చూసిన యంత్రాంగం.. ఇప్పుడు హడావిడిగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్న క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఏడు జిల్లాల్లో విస్తరించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న చెరువుల హద్దుల నిర్ధారణ పై రూపొందించాల్సిన నివేదిక మరింత జాప్యమయ్యేలా ఉంది. కనీసం బఫర్, ఎఫ్‌టీఎల్ జోన్ ప్రాంతాన్ని నిర్ధారణ పూర్తి చేయలేకపోయారు. చెరువు భూములన్నీ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లగా, హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల అన్యాక్రాంతం పై ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను నవంబర్‌లోగా ఖరారు చేయాల్సి ఉండగా.. ఇప్పటికీ ఈ అంశంలో ఎలాంటి పురోగతి లేదు.





### సమయం కోరేందుకు సిద్ధమైన యంత్రాంగం..

హెచ్ఎండీఏలో 3532కి పైగా చెరువులు ఉన్నాయి. హద్దుల నిర్ధారణ, పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాల్లో భాగంగా ఇప్పటివరకు 2525 చెరువులకు మాత్రమే ప్రాథమికంగా హద్దులను ఖరారు చేసింది. ఇందులో 230 చెరువులకు మాత్రమే పూర్తి స్థాయి బఫర్ జోన్, ఎఫ్టీఎల్ నిర్ధారించారు. మిగిలిన 1000 చెరువులకు హద్దుల నిర్ధారణలో కనీసం బఫర్ జోన్ల గుర్తింపు కూడా పూర్తి కాలేదు. కనీసం చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఆక్రమణలపై నివేదిక రూపొందించలేదు. ఈ క్రమంలో నిర్ణీత గడువులోగా పూర్తి చేసే వీలు లేకపోవడంతో.. మరి కొంత సమయం తర్వాత సమగ్రమైన నివేదికను హైకోర్టుకు అందించే యోచనలో హెచ్ఎండీఏ యంత్రాంగం ఉంది. ఈ క్రమంలో అదనంగా మరికొంత సమయం తీసుకుని, నివేదిక రూపొందించనున్నట్లు సమాచారం. నవంబర్ రెండో వారంలో జరిగే విచారణలో హైకోర్టు స్పందన ఏ విధంగా ఉంటుందని అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు.